క్లుప్తంగా

కొమరేపల్లిలో ఎర్రజెండాలు పాతిన తహసీల్దార్

దెందులూరు: కొత్తగూడెం పంచాయితీ కొమరేపల్లి శివారులో శుక్రవారం దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, వీఆర్‌ఓ రాము గురువారం రాత్రి నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా మట్టి ప్రాంతంలో శుక్రవారం కార్యాలయానికి అందిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేశారు. నిబంధనలు పాటించకుండా అనుమతులు లేకుండా గుర్తించి ఎర్రజెండాలను పాతారు.

విద్యార్థులు అన్నింటా ముందుండాలి

దెందులూరు: విద్యార్థులు అన్నింటా ముందుండాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ డీసీపీఓ డాక్టర్ సూర్యచక్రవేణి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రవేణి మాట్లాడుతూ ప్రాథమికంగా ఆరోగ్యాన్ని పరిరక్షించుకొని విద్యలో లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం కోమలేశ్వరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ప్రారంభం



దెందులూరులో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌ఎం సతీష్‌కుమార్

దెందులూరు: మండల పరిధిలో ప్రజలందరికీ నాణ్యమైన సేవలు అందించేందుకు నూతనంగా చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఏలూరు రీజనల్ మేనేజర్ జీఎస్ఎన్ సతీష్‌కుమార్, చీఫ్ మేనేజర్ వెంకన్న చౌదరి అన్నారు. శుక్రవారం దెందులూరులో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సదర్భంగా మేనేజర్ నాగార్జున అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ సతీష్‌కుమార్ బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ మొటపర్తి రాంబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సంపంగి వేణుగోపాల్ తిలక్, రంగారావు, ప్రముఖ పారిశ్రామికవేత్త కలపాల చంద్రశేఖర్ (బుజ్జి), మొటపర్తి రాజాబాబు, ఏలూరు బీఎం ఎ.బాలకృష్ణ, పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి దాతల సహకారం అవసరం

పెదవేగి : గ్రామాభివృద్ధికి దాతల సాహకారం ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుందని వంగూరు సర్పంచ్ చీలి రూతు అన్నారు. పెదవేగి మండలం వంగూరు పంచాయతీ శివారున ఉన్న లక్ష్మీపురంలో మాజీ జెడ్పీటీసీ కాసరనేని విద్యాసాగర్‌కు 20 సెంట్ల భూమి ఉంది. ఆ భూమిని శుక్రవారం స్థానిక పంచాయతీకి 20 సెంట్ల భూమి పట్టాను రాసి అప్పగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రూతు మాట్లాడుతూ దాత అందించిన 20 సెంట్ల భూమిలో రూ.5 లక్షల అంచనా వ్యయంతో 3 సెంట్లలో బోరు నిర్మాణానికి మిగిలిన 17 సెంట్లలో కమ్యూనిటీ హాల్‌ను రూ. 25 లక్షల అంచనాలతో నిర్మాణానికి శ్రీకారం చేపట్టనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి చేతుల మీదుగా శంకుస్థాపన మహోత్సవం ఘనంగా నిర్వహిస్తామని సర్పంచ్ చీలి రూతు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కే స్వరాజ్యలక్ష్మీ, వీఆర్‌ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

భీమడోలు: దేశ భక్తిని విద్యార్థి దశ నుంచి అలవర్చుకోవాలని ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురం పాఠశాలలో శుక్రవారం కపిలవస్తు సువచ్చల సూర్యనారాయణమూర్తి తల్లి జ్ఞాపకార్థం రూ.60 వేలతో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ, నెహ్రూ, సరస్వతీ దేవి విగ్రహాలను వారు ఆవిష్కరించారు. సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఎంపీపీ కనమాల రామయ్య, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి సీలిమజూనియర్, టీచర్ పద్మావతి పాల్గొన్నారు. విగ్రహదాతలు సూర్యనారాయణ మూర్తి కుటుంబ సభ్యులను అభినందించారు. ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

జంగారెడ్డిగూడెం: ప్ర టట ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని జంగారెడ్డిగూడెం సీఐ పి.బాలసురేష్‌బాబు అన్నారు. జంగారెడ్డిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ బ్లాక్ స్పాట్ ప్రాంతంలో సీఐ బాలసురేష్‌బాబు, ఎస్సై ఎం.సాగర్‌బాబు శుక్రవారం వైట్ మార్కింగ్ వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఇటీవల చోటు చేసుకున్న ప్రమాదాల్లో ద్విచక్రవాహనదారులు తలకు తీవ్ర గాయం కావడం కారణంగానే మృతి చెందారన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సబ్‌స్టేషన్ ప్రాంతంలో బ్లాక్ డేంజర్ స్పాట్ బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవస్థల్లో మార్పులతో పారదర్శక పాలన

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- 244 స్వయం సంఘాలకు రూ.1.76 కోట్ల ఆసరా చెక్కుల పంపిణీ



నారాయణపురంలో ఆసరా సధస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: వ్యవస్థల్లో సమూలమైన మార్పులు తీసుకువచ్చి ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్లిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో డ్వాక్రా సంఘాలకు రూ.1.76 కోట్లు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వాసుబాబు మాట్లాడుతూ సచివాలయం, వలంటీరు వ్యవస్థల ద్వారా ప్రజల బాగోగులు చూడటంతో పాటు పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నట్టు తెలిపారు. దళారీ వ్యవస్థ, అవినీతి లేకుండా సీఎం జగన్ పారదర్శక పాలన అందిస్తున్నారని అన్నారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా సంఘాలకు రుణాలు తాలుకా వడ్డీని మూడో విడత అందించారని అన్నారు. ఆసరా చేయూత, తదితర పథకాలు అందుకున్న కుటుంబాలు ఆర్థిక స్వావలంబన దిశగా నడుస్తున్నాయన్నారు. జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి మాట్లాడుతూ ఆసరా ద్వారా మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్నారని అన్నారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పుప్పాల గోపి మాట్లాడుతూ మాట తప్పకుండా ఇచ్చిన హామీ మేరకు పథకాలు అమలు చేసి మహిళలకు అండగా నిలిచిన సీఎం జగన్‌కు అందరూ మద్దతుగా నిలవాలన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ మరడ మంగరావు, సచివాలయాల వైసీపీ కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, నారాయణపురం ఉప సర్పంచి అడపాశ్రీనివాసరావు, పొత్తూరి శ్రీనివాస రాజు, బళ్ల త్రిమూర్తులు, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి సూర్యనారాయణ, సర్పంచులు పాల్గొన్నారు. తొలుత వాసుబాబు సమక్షంలో మహిళలు జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముందుగా వేదికపై విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- కలపర్రులో గడపగడపకు మన ప్రభుత్వం



పెదపాడు మండలంలోని కలపర్రులో ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదపాడు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదపాడు మండలంలోని కలపర్రు గ్రామంలో శుక్రవారం రాత్రి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు నిర్మించాలని, రహదారులు అభివృద్ధి చేయాలని కొంతమంది ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. దీంతో వెంటనే సంబంధిత శాఖా అధికారులను ఆదేశించారు. ఇళ్లలోను రాలేదని చెప్పడంతో వెంటనే హౌసింగ్ పీడీతో మాట్లాడి లోను ఇప్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని తెలిపారు. మహిళలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రికి ప్రతి ఒక్కరూ అండగా నిలచి, జగనన్నను ఆశీర్వదించాలన్నారు. ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని, సర్పంచ్ వత్రపు విష్ణు తులసి కోటిరెడ్డి, ఎంపీటీసీ కంభాల నాగరాజు, కొక్కిరపాడు ఎంపీటీసీ వీరంకి బుజ్జి, సర్పంచ్ మరీదు రెడ్డియ్య, బోదవరపు వెంకటేశ్వరరెడ్డి, రావులపాటి బోస్‌రెడ్డి, వత్రపు గోవిందరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గూడవల్లి కిరణ్ కుమార్, ఏపూరు సర్పంచ్ రామకృష్ణ, కొక్కిరపాడు సర్పంచ్ మరీదు రెడ్డియ్య, తహసీల్దార్ జీ విజయ కుమార్‌రాజు, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, ఏపీఎం దాసరి సుమలత తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ఎమ్మెల్యే పూజలు



సోమవరప్పాడు కొత్తూరు రామలయంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: సోమవరప్పాడులోని కొత్తూరు రామాలయంలో శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి స్వామివారికి పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలోపాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేను మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, సొసైటీ చైర్మన్ వేమూరి బసవపున్నయ్య, గ్రామ సర్పంచ్ సరిగే నాగరాజు,వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శుక్రవారం సోమవరప్పాడులో గుండె శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న కాట్రగడ్డ ప్రవీణ్ తండ్రిని పరామర్శించారు. వెన్నుముక వ్యాధితో బాధపడుతున్న బొలుసు రామును పరామర్శించారు. చెట్టుపై నుంచి పడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న జగన్నాధపురం గ్రామానికి చెందిన అంకెం వెంకటేశ్వరరావును పరామర్శించారు. చైత్ర ఆసుపత్రిలో పెదపాడు గ్రామానికి చెందిన పడాలి నాగరాజు కుమారుడిని పరామర్శించారు. జోగన్నపాలెం గ్రామానికి చెందిన బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ ఏలూరు చైత్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మున్నా లాజర్‌ను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, పెదపాడు మండల పార్టీ అధ్యక్షుడు అప్పన్న ప్రసాద్, దెందులూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఏలూరు మండల అధ్యక్షుడు తేరా ఆనంద్ ఉన్నారు.

సంక్షేమ పాలనపై విష ప్రచారాన్ని అడ్డుకోండి

ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



చాటపర్రులో సమావేశంలో పాల్గొన్న మహిళలు

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు చేస్తోన్న విష ప్రచారాన్ని అడ్డుకోవాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పిలుపునిచ్చారు. శుక్రవారం ఏలూరు మండలం చాటపర్రులో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు దేశానికే తలమానికమన్నారు. రాష్ట్ర ప్రజల మన్ననలు అందుకుంటున్న పాలనపై టీడీపీ అక్కసు కక్కుతోందని దుయ్యబట్టారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా లక్షలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందించామన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా తదితర పథకాలు అందించి ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పార్టీ శ్రేణులు పని చేయాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించడంతో పాటు టీడీపీ విషప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ ప్రసాద్, చాటపర్రు సర్పంచ్ గుడిపూడి రఘు, పార్టీ మండల అధ్యక్షుడు తేనా ఆనంద్, మండల కొండలరావు, రైతు సంఘం చైర్మన్ బొల్లిముంత రామ్మోహనరావు, కోటేశ్వరరావు, నరహరశెట్టి రాధాకృష్ణ, బేబమ్మ సర్పంచ్‌లు వర్రి లక్ష్మీదుర్గ, బలే నాగప్రసాద్, పత్యాల సునీత, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు



చిన్నారులకు బహుమతులు అందిస్తున్న తుమ్మల ఉమామహేశ్వరరావు, హెచ్‌ఎం

భీమడోలు: విద్యార్థులు ప్రణాళికాబద్ధగా చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. ఆగడాల లంక ఓరియంటల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి 25 ఏళ్లు చదువుకున్నట్లయితే ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు, చదువు ద్వారా సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఈనెల 3 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నందున ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రతిభ కలిగిన ముంగర అఖిల్‌కు రూ.వెయ్యి, జల్లూరి ప్రశాంతికి రూ.500 నగదు పురస్కారాలను అందించారు. విద్యార్థులకు డిక్షనరీలు, ఇంగ్లీషు గ్రామర్ పుస్తకాలు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, మానవత మండల చైర్మన్ గుల్ల నూకరాజు, కోశాధికారి గుల్ల అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కలపర్రులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

పెదపాడు: మండలంలోని కలపర్రు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం 7గంటల నుంచి 11.30 గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 9గంటల వరకు జరిగే ఈకార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొని గడపగడపకూ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందించిన పథకాలను గురించి వివరిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటారని చెప్పారు. మండలంలోని కార్యకర్తలు అభిమానులు నాయకులు విధిగా హాజరుకావాలని ప్రసాద్ తెలిపారు.

నేడు భీమడోలులో ఆసరా పథకం సభ

భీమడోలు: భీమడోలు ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 1న శనివారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ ఆసరా పథకంలో డ్వాకా సంఘాల మహిళలకు మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరు కానున్నారని పార్టీ నాయకులు తెలిపారు. భీమడోలు మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు శుక్రవారం మాట్లాడుతూ భీమడోలు, పోలైసానిపల్లి, సూరప్పగూడెం, అంబర్‌పేట గ్రామపంచాయతీల్లోని మహిళలు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు. భీమడోలు పంచాయతీ కార్యాలయంలో కొత్తగా కొనుగోలు చేసిన ట్రాక్టర్‌ను, బీసీ కాలనీలో కొత్తగా బోరు నిర్మాణానికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శంకుస్థాపన చేస్తారని సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, కార్యదర్శి ఎన్.ఠాగూర్ తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గణపవరం: ప్రస్తుతం వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా వైద్య సిబ్బంది ప్రజలకు అంటువ్యాధులపై అవగాహన కల్పించి, ఫీవర్ సర్వే నిర్వహించారు. టైఫాయిడ్, డెంగీతో పాటు అనేక రకాల అంటు వ్యాధులకు మూలం అపరిశుభ్రత, దోమలేనని, దోమల నిర్మూలనతో అంటు వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. గణపవరం, పిప్పర పీహెచ్‌సీల పరిధిలోని గణపవరం, సరిపల్లె, మండలం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని కాశిపాడు, చిలకంపాడులో వ్యాధుల వ్యాప్తి, నివారణపై అవగాహన కల్పించారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్య సహాయకులు నామాలరాజు, యోహాన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ తలంబ్రాల పంపిణీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శుక్రవారం కల్యాణ తలంబ్రాలు పంపిణీ చేశారు. పరిషత్ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ, కొనకళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో 2002 నుంచి పరిసర గ్రామాల్లో సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవానికి తలంబ్రాల వితరణ చేస్తున్నామని తెలిపారు.

లాభాల బాటలో నారాయణపురం సొసైటీ

ఉంగుటూరు: నారాయణపురం సొసైటీ ఏడాది కాలంలో రూ.78.40 లక్షలు లాభాలు ఆర్జించినట్టు సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి వెల్లడించారు. శుక్రవారం నారాయణపురం సొసైటీ భవనంలో రైతులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు పాపారావుబాబ్జి మాట్లాడుతూ రూ.1. 90 కోట్ల డివిడెండ్లు రైతులకు అందించాల్సి ఉందని తెలిపారు. రూ.110 కోట్ల రుణాలు రైతులకు అందజేయగా, రూ.40.54 కోట్లు వసూలు చేసినట్టు తెలిపారు. 5,109 మందితో ఉన్న సభ్యుల సంఖ్య నేడు 5,436కి పెరిగిందని అన్నారు. రూ.7.64 కోట్ల ఆదాయం వస్తుందన్నట్లు అంచనా వేసి ఆమోదించారు. సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు దాసరి సత్యనారాయణ, సురే ఏడుకొండలు పాల్గొన్నారు. సొసైటీ కార్యదర్శి యర్రాశ్రీను నివేదిక చదివి వినిపించారు.

హరిశ్చంద్ర సేవలు ఆదర్శనీయం

గణపవరం: మూడు దశాబ్దాలుగా రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తూ, నిత్యం ధూప దీప నైవేద్యాలను సమర్పిస్తూ సర్వమత సమానత్వాన్ని చాటిచెబుతున్న మతి హరిశ్చంద్రప్రసాద్ ఆధ్యాత్మిక సేవలు అందరికీ ఆదర్శనీయమని గ్రామస్తులు అన్నారు. గణపవరం మండలం కాశిపాడులోని ఎస్సీపేటలోని రామాలయంలో హరిశ్చంద్రప్రసాద్ మూడు దశాబ్దాలుగా శ్రీరాముని సేవలో తరిస్తున్నారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు నంద్యాల రామలింగరాజు, నియోజకవర్గ కన్వీనర్ ఇంటి ఉదయభాస్కర్ అన్నారు. హరిశ్చంద్రప్రసాద్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. గ్రామానికి చెందిన వేగేశ్న వాసురాజు సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు జంపన పద్మావతి రమేష్‌రాజు, మండల బీజేపీ అధ్యక్షుడు కొయ్యా వెంకటసుబ్బారావు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిన్నం సిల్వస్టర్‌రాజు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

పెదపాడు: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని పెదపాడు మండల ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పెదపాడు మండలంలోని ఉపాధ్యాయులకు ప్రజాప్రతినిధులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మశ్రీ ఎంపీపీ రత్నకుమారి, ఆళ్ల సతీష్‌చౌదరి పదో తరగతి పరీక్షల విశిష్టతను తెలిపే వాల్ పోస్టర్లను ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, ఆర్ఐ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పెదపాడు: బాలల భవిత్యకు పోషకాహారంతో ఎంతో ముఖ్యమని, పోషకాహారం తీసుకుంటే బాగా చదవగలుగుతారని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.పద్మావతి అన్నారు. పోషకాహార పక్షోత్సవంలో భాగంగా శుక్రవారం ఐసీడీఎస్ పెదపాడు ప్రాజెక్టు పరిధిలోని వట్లూరులో జరిగిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంపూర్ణ పోషణ పథకం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీడీపీఓలు, నోడల్ అధికారి తదితరులు పాల్గొన్నారు

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

భీమడోలు: పోలసానిపల్లికి మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా అన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రత్యేక దృష్టి సారించి జలజీవన్ మిషన్‌లో రూ.20లక్షల మంజూరు చేయించారని అన్నారు. దీనితో గ్రామంలో నూతన పైప్‌లైన్ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ పనులను శుక్రవారం సర్పంచ్ పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

ప్రతి ఇంటికి సురక్షిత నీరు

పెదవేగి : ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందించే దిశగా కృషి చేస్తున్నామని వంగూరు పంచాయతీ కార్యదర్శి కె స్వరాజ్యలక్ష్మీ అన్నారు. పెదవేగి మండలం వంగూరు పంచాయతీ పరిధిలోని వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరిందని పంచాయతీకి అందిన ఫిర్యాదుపై ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్, కార్యదర్శిని అప్రమత్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ సిబ్బంది ప్రతి ఇంటి కుళాయికి వాటర్ ట్యాంక్‌తో సంబంధం లేకుండా నేరుగా పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేశారు. నాయకులు చీలి జోసెఫ్, పచ్చా శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

గణపవరం: గణపవరం మండలం వల్లూరు శివారున పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు గణపవరం ఎస్సై వేముల వెంకటేశ్వరరావు శుక్రవారం మధ్యాహ్నం సిబ్బందితో ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని, రూ.4వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. నిందితులను తాడేపల్లిగూడెం కోర్టులో హాజరుపరచినట్టు ఆయన చెప్పారు.

9 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



అభయాంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాలకు రాట ముహూర్తం పూజలు

పెదపాడు: అప్పనవీడులో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయస్వామి వారి 22వ జయంతి మహోత్సవాలకు శుక్రవారం సుముహూర్తపు రాటను వేశారు. ప్రతి ఏటా మంచి రోజున ముహూర్తపు రాట వేసి జయంతి ఉత్సవాల పనులను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవాలను మే 9నుంచి 14వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండల కన్వీనర్ అప్పన కనకదుర్గాప్రసాద్, దేవాలయ చైర్మన్ నెర్సు నాగభూషణం, దేవాలయ ఈఓ ఎణివాస్, బాపులపాడు మండల మాజీ జెడ్పీటీసీ సుంక సుభాష్ చంద్రబోస్, నారికమిల్లి కనకదుర్గా ప్రసాద్, మేడేపూడి రామ్మోహనరరావు మండలపు సులోచన, తాడి రంగారావు, బోయపాటి శ్రీను, సగ్గుర్తి శ్రీను వడ్డి చిన్నయ్య , ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

దెందులూరు: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీ(దుగ్గిరా) కరస్పాండెంట్ ఫాథర్ జీ.మోజెస్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కొవ్వలిలో సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీ విద్యార్థుల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్లీవరాజు ఆధ్వర్యంలో ప్రారంభమైంది. తొలుత విద్యార్థులు గ్రామంలో పర్యటించి ప్రధాన సమస్యలు తెలుసుకుని దంత వైద్యంపై అవగాహన కల్పించారు. డాక్టర్. పావన సంధ్య, డాక్టర్ టీ.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హాల్‌టికెట్ల పంపిణీ

పెదవేగి : ప్రతి విద్యార్థి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని పెదవేగి ఎంపీడీవో జి.రాజమనోజ్ కోరారు. వేగివాడ, ముండూరు, కొప్పాక, విజయరాయి, పెదవేగి, భోగాపురం, వంగూరులో ఉన్న ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు ఆయన శుక్రవారం హాల్ టిక్కెట్లను ఆయన పంపిణీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.